డీజే నిర్వాహకులపై కేసు



పోలీసులు సీజ్ చేసిన డీజే

చైతన్యపురి: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు హెచ్చరించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం డీజేకి అనుమతి లేదని ఎవరైనా అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి డీజేతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. బుధవారం అర్ధరాత్రి మోహన్ నగర్ ప్రజయ్‌నివాస్ ఫేస్–1లో గణేష్ ఆగమనం సందర్భంగా అనుమతి లేకుండా డీజే పెట్టారన్న సమాచారంతో డీజే ఆపరేటర్‌పై కేసు నమోదు చేశామన్నారు. వినాయక మండపాల వద్ద నార్మల్ స్పీకర్లు మాత్రమే ఉపయోగించాలన్నారు.

కాలనీలో కార్పొరేటర్ పర్యటన



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ లక్ష్మినరసింహ ఫణిగిరి కాలనీలో స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా వాటర్‌వర్క్స్ డీజీఎం రవివర్మతో కలిసి పర్యటించారు. రోడ్డు నం.40లో చాలా కాలంగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. రహదారులపైకి మురుగు నీరు ప్రవహిస్తుండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.37, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.45, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.13, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.25, మునగ రూ.23, కందగడ్డ రూ.40, బీట్‌రూట్ రూ.21, కీర రూ.18, బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.43. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

బహిరంగ వేలానికి స్పందన



వేలం దక్కించుకున్న వారిని అభినందిస్తున్న ఈఓ లావణ్య

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలోని కొబ్బరిచిప్పలు, అమ్మవారి చీరల సేకరణ, వాహనాల పార్కింగ్ వంటి సేవా హక్కులు, నిర్వహణకు గురువారం ఆలయ ఈఓ లావణ్య ఆధ్వర్యంలో జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ సమక్షంలో నిర్వహించిన బహిరంగ, సీల్డ్ టెండర్ వేలానికి స్పందన వచ్చింది. పార్కింగ్ నిర్వహణను స్థానిక నివాసి సుభాష్ రూ.18.50 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణను మల్లయ్య రూ. 14.50 లక్షలు, అమ్మవారి చీరల సేకరణను కరుణాకర్ రూ. 1.45 లక్షలకు వేలంలో దక్కించుకున్నారని ఈఓ లావణ్య స్పష్టం చేశారు. వేలంలో సేవాహక్కులను దక్కించుకున్న వారిని శాలువాలతో సన్మానించారు.

బట్టల దుకాణంలో విద్యుదాఘాతం

చంపాపేట: విద్యుదాఘాతంలో బట్టల దుకాణం దగ్ధమైన ఘటన చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో చోటు చేసుకుంది. కర్మన్‌ఘాట్‌కు చెందిన ఎరుకల లావణ్యగౌడ్ శుభోదయకాలనీలోని అద్దె ఇంట్లో శివానీ లేడీ టైలర్ పేరిట బట్టలు, కిరాణా, కుట్టు కేంద్రాన్ని నిర్వహిస్తుంది. గురువారం మధ్యాహ్నం లావణ్య భోజన చేసేందుకు షట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లిన కాసేపటికే దుకాణం లోంచి పొగ రావటాన్ని గమనించిన స్థానికులు ఆమెకు సమాచారం అందించారు. అప్పటికే దుకాణంలోని సరుకులు, బట్టలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



చెరువులో చెత్త..
కుంగిపోతున్న కట్ట

అధ్వానంగా సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్

- ఇంకా ప్రారంభం కాని నిమజ్జన ఏర్పాట్లు
- దృష్టి సారించాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు



సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

చైతన్యపురి: గణపతి నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్నప్పటికి సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు ప్రారంభం కాలేదు. రోజు రోజుకి సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ అందవిహీనంగా మారినా ఇరిగేషన్, జీహెచ్‌ఎంసి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో భారీగా చెత్త పేరుకుపోయి మురుగు చేరి కంపు కొడుతోంది. నిమజ్జన కార్యక్రమానికి ముందు చెరువులోని చెత్తను తొలగించటం, పూడిక తీత పనులు చేయాల్సి ఉంది. కనీసం వినాయక విగ్రహాలు పూర్తిగా నీటిలో మునిగే పరిస్థితి కూడా లేదని మండపాల నిర్వాహకులు వాపోతున్నారు.

ఏపుగా పిచ్చిమొక్కలు...

బలహీనంగా మారిని చెరువు కట్ట కుంగిపోయి పగుళ్లు ఏర్పడ్డాయి. దీంత కట్టపై ఉన్న విద్యుత్ స్తంభాలు సైతం ఒరిగిపోతున్నాయి, నిమజ్జనం కోసం క్రేన్ ఏర్పాటు చేసే ప్రాంతం కూడా కుంగిపోయేలా ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నీటికి కట్టకు మధ్యలో పిచ్చి మొక్కలను ఏపుగా మొలిచాయి. ఎప్పటికప్పుడు తొలగించకపోవటంతో ఈ దుస్థితి నెలకొంది. కట్టపై చాలా కాలం క్రితం ఏర్పాటు చేసిన ఫ్లోరింగ్ టైల్స్ ఊడిపోయి సందర్శకులు నడిచేందుకు వీలు లేకుండా పోయింది. కట్టపై పలు చోట్ల చెత్తకుప్పలు దర్శమనిస్తున్నాయి. ఇటీవల ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ సైతం మినీ ట్యాంక్‌బండ్‌ను సందర్శించారు.

ఊడిపోయినన ఫెన్సింగ్ గ్రిల్స్



ఊడిపోతున్న ఫెన్సింగ్

సరూర్‌నగర్ చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్ చాలా చోట్ల ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. నిమజ్జనం తిలకించేందుకు వేలాదిగా వచ్చే సందర్శకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన ఏర్పాటు చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఇటీవలే జీహెచ్‌ఎంసీ జోనల్ కమీషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నగరంలో ట్యాంక్‌బండ్ తర్వాత గణపతి విగ్రహాలు సరూర్‌నగర్ చెరువు వద్దకే తరలివస్తుంటాయి. ఇంత ప్రసిద్ధి చెందిన మినీట్యాంక్ బండ్ అభివృద్ధికి నోచుకోకపోవటం గమనార్హం. ప్రభుత్వాలు మారినా మినీట్యాంక్ బండ్ పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అన్ని శాఖల అధికారులు స్పందించి త్వరిగతిన పనులు చేపట్టాలని కోరుతున్నారు.



చెరువు కట్టపై ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

చాదర్‌ఘాట్: పాత మలక్‌పేట, అజంపురా డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశించారు. గురువారం అజంపురా పాత మలక్‌పేట డివిజన్లలో పర్యటించిన ఆయన జీహెచ్‌ఎంసీ వివిధ శాఖల అధికారులు, ఎంఐఎం నాయకులతో పెండింగ్ పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వర్షాకాలంలో అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం వహించవద్దని, చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద సమస్యలకు దారి తీస్తుందన్నారు.అభివృద్ధి పనుల విషయంలో అలసత్వాన్ని సహించబోమని, క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. వర్షాకాలంలో రోడ్లు, డ్రైనేజీ, కలుషిత నీటి సరఫరా వంటి సమస్యలు ఎక్కువగా తలెత్తుతాయని, వాటి విషయంలో వెంటనే స్పందించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో షఫీ, అబ్రార్, మడీజీఎం హస్మత్‌అలీ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న మిద్దెల జితేందర్



చెక్కు అందజేస్తున్న మధుయాష్కిగౌడ్

చంపాపేట: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేదర్ అన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ఉల్లోజు సంపత్‌కుమార్ గొంతు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా అతని బంధువులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. రెక్కాడితే కాని పూటగడవని సంపత్‌కుమార్‌కు చికిత్స బిల్లు చెల్లించటం భారంగా మారింది. ఆయన బంధువులు అందినకాడికి అప్పుచేసి ఎట్టకేలకు బిల్లును చెల్లించారు. విషయం తెలుసుకున్న మిద్దెల జితేందర్ బాధితుడితో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించగా మంజూరైన రూ.60 వేల చెక్కును గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్యాంసుందర్, శ్యామల, రమణి పాల్గొన్నారు.

మన్సూరాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ అన్నారు. ఎల్‌బీనగర్‌కు చెందిన బుచ్చమ్మకు రూ.41,500, కర్మన్‌ఘాట్‌కు చెందిన శీతల గజ్జింకర్‌కు రూ.60 వేలు, అయితగోని లోకేష్‌కు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం ఆయన అందజేశారు.

జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం

మలక్‌పేట: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం 69వ ఇంటర్ జోనల్ క్రీడలు సైదాబాద్ జోన్ మూసారంబాగ్ స్వామి వివేకానందా సెంటనరీ హైస్కూల్లో నిర్వహించారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, సైదాబాద్ డిప్యూటీ ఈవో సుకన్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆటలతో దేహదారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఓం హరికృష్ణ, వరప్రసాద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీదేవి, శివకుమార్ పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న బాలికలు

పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం



విద్యార్థులతో నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం కుంట్లూర్ రోడ్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ సహకారంతో వాటర్ టాంక్‌ను అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో సమస్యలపై అధ్యాపకులు తన దృష్టికి తీసుకొచ్చారని, పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బందిని పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అప్పారావుగౌడ్, మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాము, ప్రధానోపాధ్యాయులు వనజ పాల్గొన్నారు.

ఉప్పరిగూడలో ఓపెన్ జిమ్ ప్రారంభం

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ ఆజాద్ పార్క్‌లో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసి ఓపెన్ జిమ్‌ను గురువారం యాఖుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ ప్రారంభించారు.అయిఏ గత సోమవారం ప్రారంభించాల్సి ఉండగా ఎంఐఎం నాయకుల పేర్లతో శిలాఫలకం ఉండటంతో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు అనధికారికంగా ప్రారంభించాడు. దీంతో ఎమ్మెల్యే ప్రారంభోత్సవానికి రాలేదు. గురువారం ఉప్పరిగూడ బస్తీకి వచ్చిన ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ అధికారికంగా జిమ్‌ను ప్రారంభించారు. ఇదిలా ఉండగా బీజేపీ ఎమ్మెల్సీ పేరు శిలాఫలకంపై లేదని బీజేపీ నాయకులకు ఆందోళనకు దిగారు.



జిమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



అధికారులతో సమావేశమైన డీసీపీ చైతన్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్

సైదాబాద్: ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ సూచించారు. రానున్న గణేష్ నవరాత్రులు, మిలాద్ ఉన్ నబి వేడుకలను పురస్కరించుకొని గురువారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆయన అన్ని విభాగాల ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉత్సవాల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదకరంగా ఉన్న కేబుళ్లను తొలగించాలని సూచించారు. రహదారులపై గుంతలు లేకుండా మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు, మిలాద్ ఉన్ నబి వేడుకల నిర్వాహకులతో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో నడుచుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఏసీపీలు సుబ్బిరామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, పోలీస్, జీహెచ్‌ఎంసీ, ఫైర్ డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రిసిటీ, జలమండలి, వైద్య శాఖ, ట్రాఫిక్ విభాగం, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

చైతన్యపురి: పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం కర్మన్‌ఘాట్ లక్ష్మి కన్వెన్షన్ హాల్లో ఆయా శాఖల అధికారులు, వినాయక మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీజే ఏర్పాటుకు అనుమతి లేదని మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపి కృష్ణయ్య, ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారి

మండపాలకు అనుమతి తప్పనిసరి..

చాదర్‌ఘాట్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారి సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న వినాయక చవితి నేపథ్యంలో పాత మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని సిమ్లా గార్డెన్స్‌లో మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాలను రహదారులపై కాకుండా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని, ఒకవేళ రోడ్డుపై ఏర్పాటు చేయాల్సి వస్తే రాకపోకలకు అంతరాయం లేకుండా చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద నీటి డ్రమ్ములు ఏర్పాటు చేసుకోవాలని, లౌడ్ స్పీకర్ల వినియోగంపై సమయపాలన పాటించాలన్నారు.

'ఓనస్'లో అరుదైన శస్త్రచికిత్స

సైదాబాద్: చంపాపేటలోని ఓనస్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గురువారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎండీ బాలరాజు నాయుడు వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్వేన్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు బి.నాగయ్యగౌడ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంటి వద్ద హఠాత్తుగా సొమ్మసిల్లి పడిపోయాడు. చికిత్స నిమిత్తం ఓనస్‌కు తరలించగా పరిశీలించిన వైద్యబృందం అతడి మెదడులో రక్తస్రావం అయినట్లు గుర్తించి అత్యాధునిక ఎండోవాస్కులర్ విధానంతో మెదడులో స్టంట్ వేసే అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. రోగికి ఇలాంటి పరిస్థితుల్లో ఓపెన్ బ్రెయిన్ సర్జరీ చేస్తారని కానీ తమ వైద్య బృందం అరుదైన విధానంలో అతడికి శస్త్రచికిత్స చేశామన్నారు. ఈ సమావేశంలో వైద్యులు సూర్యతేజారెడ్డి, మనోజ్ వాసిరెడ్డి, రవికిరణ్ పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌కు మరమ్మతులు చేపట్టాలి

హుడాకాంప్లెక్స్: ఏటా వినాయక చవితి వస్తుందని తెలిసినా అధికారులు, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తూ.. సదుపాయాలు చేయకుండా హిందువుల పండుగలను చిన్న చూపు చూస్తున్నారని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆరోపించారు. గురువారం ఆమె సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను సందర్శించారు. చెరువు కట్టపై గుంతలను, బండ్ పగుళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎక్కడైనా వినాయక విగ్రహాలు తేవడం నుంచి నిమజ్జనం వరకు భక్తులకు ఇబ్బందులు కలిగితే ఊరుకోమన్నారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీలు, మండపాల వద్ద సదుపాయాలు, విగ్రహాల రాకపోకల దారుల్లో చెట్లకొమ్మలు, విద్యుత్ వైర్లు తొలగించడం, నిమజ్జనానికి మార్గం సుగమం చేయడం ఎంతో అవసరమన్నారు. సరూర్‌నగర్ చెరువు బండ్ విరిగిపోయే ప్రమాదం ఉందని, ఎన్ని నెలలుగా సూచనలు ఇచ్చినా అధికారులు నిద్రపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నాగోలు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం వనస్థలిపురం, ఆటోనగర్, హయత్‌నగర్ బస్టాండ్, అభయ అంజనేయ స్వామి ఆలయం, అంబర్‌పేట్ యుటర్న్, రామోజీ ఫిలిం సిటీ, కవాడిపల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లి వచ్చే సమయాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్దనే రోడ్డు దాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఓ అమరవర్ధన్ రెడ్డి, సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు పడపరాదు..

నాగోలు: మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 98 మందికి గురువారం వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే మీ కుటుంబ సభ్యులతో పాటు ఇతరుల కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు.

13 మంది చైన్‌మెన్ల బదిలీ

అవినీతి ఆరోపణలే కారణమా?

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ ఐదు సర్కిళ్ల పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న 13 మంది చైన్ మెన్లను అకస్మాత్తుగా బుధవారం రాత్రి బదిలీ చేశారు. దీనికి కారణం సుదీర్ఘంగా ఒకే సర్కిల్‌లో పనిచేయడం, దీంతో అవినీతి ఆరోపణలు రావడంతోనే ఒకేసారి 13 మందిని బదిలీ చేయడం కలకలం రేపింది. చైన్‌మెన్లు ప్రధానంగా ఇంటి నిర్మాణదారులతో కుమ్మక్కై అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలపై చర్యలు తీసుకునేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులకు రోజు వారీగా రిపోర్టు చేయాల్సి ఉన్నా వీరు చేయకపోవడం దీనికి తోడు అక్రమంగా నిర్మించే భవన నిర్మాణదారాలతో కుమ్మక్కై వసూళ్లకు పాల్పడుతున్నందున వీరిపై అనేకసార్లు ప్రజావాణితోపాటు వ్యక్తిగతంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రేటర్ కమిషనర్ వచ్చిన ఫిర్యాదులును పరిశీలించిన తర్వాత ఒకే సారి అవినీతి చైన్‌మెన్లకు స్థానం చలనం కల్పించారు. ఎల్‌బీనగర్‌లో పనిచేసే చైన్‌మెన్లను వివిధ సర్కిళ్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వివిధ సర్కిళ్లకు బదిలీ..

కాప్రా సర్కిల్‌లో పనిచేసే గంగాధర్, బాల్‌రాజ్, మహేందర్, ఉప్పల్ సర్కిల్‌లో పనిచేసే లక్ష్మణ్, హయత్‌నగర్ సర్కిల్‌లో పనిచేసే సత్యనారాయణ, రాజులను చార్మినార్ జోన్‌కు బదిలీ చేశారు.ఎల్‌బీనగర్ సర్కిల్–4లో పనిచేసే జ్ఞానేశ్వర్‌ను ఖైరతాబాద్ జోన్‌కు బదిలీ చేశారు. కాప్రా సర్కిల్‌లో పనిచేసే వెంకటేశ్‌ను సికింద్రాబాద్ జోన్‌కు బదిలీ చేశారు. హయత్‌నగర్ సర్కిల్‌లో పనిచేసే శ్రీనివాస్, విజయ్, ఎల్‌బీనగర్ సర్కిల్‌లో పనిచేసే యాదయ్య, సరూర్‌నగర్ సర్కిల్‌లో పనిచేసే ప్రవీణ్‌కుమార్, ఉప్పల్ సర్కిల్‌లో పనిచేసే రాజును ఎల్‌బీనగర్ జోనల్ నుంచి సికింద్రాబాద్ జోనల్ కార్యాలయానికి బదిలీ చేశారు. వీరి స్థానంలో చార్మినార్ జోనల్ కార్యాలయంలోని వివిధ సర్కిళ్ల పరిధిలో పనిచేస్తున్న నర్సింగ్‌రావు, అబ్బాస్‌అలీ, రమేష్, రహీందర్, సత్యనారాయణ, కృష్ణను ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో పరిధిలో పనిచేస్తున్న పలువురు చైన్‌మెన్ చంద్రయ్యను కూకట్‌పల్లి జోన్‌లో పనిచేస్తున్న తిరుమలేష్‌ను, సికింద్రాబాద్ జోనల్ పరిధిలో పనిచేసే శ్రీధర్,రాజు, నరేష్‌ను ఎల్‌బీనగర్‌జోన్‌కు బదిలీ చేశారు. బదీలీలు అయి వచ్చి విధుల్లో చేరిన తర్వాత ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ వీరికి ఆయా సర్కిళ్లలో నియమించనున్నారు.



ఎల్‌బీగర్ జోనల్ కార్యాలయం